క్లుప్తంగా

ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపిన వివరాలు..వెంకటగిరికి చెందిన నరేష్(34), ప్రసాద్(31) ద్విచక్ర వాహనంపై తిరుపతికి వెళుతుండగా సీతారాంపేట వద్ద ముందు వెళుతున్న లారీని అధిగమించబోయి అదుపు తప్పడంతో ప్రమాదానికి గురయ్యారు. గాయాల పాలైన వారిద్దరినీ ప్రైవేట్ వాహనంలో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీబీఎస్ఈ టెన్త్ ఫలితాల్లో ప్రతిభ

వరదయ్యపాళెం: సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో శ్రీసిటీ చిన్మయ విద్యాలయం 100శాతం ఉత్తీర్ణత సాధించింది. పాఠశాలలో 39 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరు కాగా అందరూ పాసైనట్లు చిన్మయ విద్యాలయ ప్రిన్సిపల్ కె. భువనేశ్వరి శనివారం తెలిపారు. 22 మంది డిస్టింక్షన్, 10 మంది ఫస్ట్‌క్లాస్, ఏడుగురు సెకండ్‌క్లాస్‌లో ఉత్తీర్ణులయ్యారని, వీరిలో వి.కేశవ్ (476), ఎం.సోహన్‌కృష్ణ (470), ఎన్‌జీ దేవాజ్ ప్రభాకర్ (459), ఎం.చరణ్‌తేజ (458), ఎం.పార్థసారథి (450) మార్కులు సాధించి స్కూల్ టాపర్లుగా నిలిచారని ఆమె తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించినందుకు విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు.

కాంగ్రెస్ పార్టీ విజయోత్సవం



విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

తొట్టంబేడు(రేణిగుంట): కర్ణాటకలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 136 సీట్లతో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంతో శనివారం శ్రీకాళహస్తిలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ ఎస్.బత్తెయ్య నాయుడు ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. రాబోయే రోజుల్లో అన్ని రాష్ట్రాల ప్రజలు మోదీకి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌కె.జానీ బాషా, బి.విజయ్ శేఖర్, టి.శివయ్య, ఈ. గోపి, రాఘవరెడ్డి, నాగూరయ్యా, ఎస్.శివయ్య, మోహన, వానమ్మ, మస్తానమ్మ పాల్గొన్నారు.

లాటరీ పద్ధతిలో 'గురుకులం' అడ్మిషన్లు

కోట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో లాటరీ విధానంలో అడ్మిషన్లు ఇవ్వనున్నట్టు ప్రిన్సిపల్ రమేష్‌బాబు శనివారం తెలిపారు. ఈ విద్యాసంవత్సరానికి 3 నుంచి 9 వ తరగతి వరకు ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు.3లో40, 4లో36, 5లో32, 6లో24, 7లో5, 8లో1, 9వ తరగతిలో 8 సీట్లు ఖాళీలు ఉన్నట్లు వివరించారు. ఈ నెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి: స్థానిక ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల (బాలికలు)లో 3వ తరగతి ప్రవేశంతోపాటు 4 నుంచి 9వ తరగతి వరకూ బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు చేసుకోవాలని, లాటరీ విధానంలో సీట్లు భర్తీ చేస్తామని ఆ పాఠశాల ప్రిన్సిపల్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 3వ తరగతిలో 31 సీట్లు (ఎస్టీ), ఎస్సీ కేటగిరికి 5, బీసీకి 2, ఓసీ 1 సీటు చొప్పున ప్రభుత్వం కేటాయించిందని, ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో కలశమాల శోభాయాత్ర

నాయుడుపేటటౌన్: స్వర్ణముఖినది నుంచి పట్టణంలోని అగ్రహారపేటలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం వరకు మంగళవారం స్వామివారి కలశమాల శోభా యాత్రను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. హనుమ జయంతి సందర్భంగా స్వర్ణముఖి నది వద్ద ప్రత్యేక పూజలు చేపట్టి కలశాలలో జలాలు తీసుకుని శ్రీరామ సంకీర్తనలతో మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు.

భక్తులతో కిక్కిరిసిన పెంచలకోన

రాపూరు: మండలంలోని పెంచలకోన శనివారం భక్తులతో కిక్కిరిసింది. బ్రహ్మోత్సవాల అనంతరం వచ్చే మొదటి శనివారం కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

శాస్త్రోక్తంగా మహా శాంతి తిరుమంజనం

తిరుపతి కల్చరల్: కపిలతీర్థంలోని పురాతన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ మహా సంప్రోక్షణలో భాగంగా శనివారం మహా శాంతి తిరుమంజనాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం యాగశాలలో వైదిక కార్యక్రమాలు, అక్షిణ్మోచనం, పంచగవ్యాధివాసం, క్షీరాధివాసం, జలాధివాసం, రత్నన్యాసం, బింబస్థాపన, అష్టబంధన, కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, సాయంత్రం బింబవాస్తు, నవ కలశ చతుర్దశ కలశ స్నపనం, మహాశాంతి తిరుమంజనం, పూర్ణాహుతి, శయనాధివాసం నిర్వహించారు. ఆదివారం ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య మిథున లగ్నంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి వారికి మహా సంప్రోక్షణ నిర్వహిస్తారు. తర్వాత భక్తులకు సర్వదర్శనం ప్రారంభమవుతుంది. కార్యక్రమంలో టీటీడీ వైఖానస ఆగమ సలహాదారుడు మోహన రంగాచార్యులు, డెప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

- అడవికొడియంబేడు జగనన్న కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం
- జగనన్న ఇంటి గృహ ప్రవేశంలో ఎమ్మెల్యే ఆదిమూలం



జగనన్న కాలనీలో కొత్త ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



అడవికొడియంబేడు జగనన్న కాలనీలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు: జగనన్న కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. శనివారం ఉదయం మండలంలో అడవికొడియంబేడులోని జగనన్న కాలనీలో నూతన ట్రాన్స్ ఫార్మర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే ఇక్కడ మేరి ఇంటి గృహ ప్రవేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణానికి నీరు, విద్యుత్ సౌకర్యం వసతులను ఇప్పటికే ప్రభుత్వం కల్పించిందన్నారు. త్వరలో ఈ కాలనీలలో సిమెంటు రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, చిన్న పిల్లల పార్కు వంటి వసతులు కల్పిస్తామన్నారు. ఇంటి పట్టాలు పొందిన ప్రతి ఒక్కరూ త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలని ఆయన కోరారు. ఇంకా ఎవరికైనా సొంత ఇల్లు లేని వారు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే వారికి ఇంటి పట్టాతో పాటు జగనన్న ఇల్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దారు మధుసూదన్ రావు, హౌసింగ్ ఏఈ ముత్తుకుమార్, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, సర్పంచులు మునివేలు, అన్నాదురై, ఎంపీటీసీ రమేష్ రాజు, మాజీ వైస్ ఎంపీపీ పాల పద్మనాభం, సచివాలయ మండల కన్వీనర్ తొప్పయ్య, సింగిల్‌విండో మాజీ చైర్మన్ శేఖర్ రెడ్డి, నాయకులు మోహన్, సుబ్రమణ్యం, కిరణ్‌కుమార్, చలపతిరాజు, ఆర్ముగం రెడ్డి, శేఖర్, బాబు రెడ్డి, ఏసు, అన్బు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌సీపీ నేత మృతికి ఎమ్మెల్యే నివాళి

నాగలాపురంలో వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నేత జయవేల్ రెడ్డి(65) అనారోగ్యంతో శనివారం ఉదయం మరణించారు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యే కోనేటి నాగలాపురానికి వెళ్లి మృతుని భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. జయవేల్ రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. రైతు మండలి చైర్మన్ చిన్నదొరై, వైఎస్ఆర్ టీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు ఎస్ఎం సురేష్, నాయకులు మహేష్ రెడ్డి, దేశప్పన్, మహేష్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 241 కేసులు పరిష్కారం



కేసులు పరిష్కరిస్తున్న జడ్జి శ్రీకాంత్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బేబిరాణి

సత్యవేడు: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 241 కేసులు పరిష్కరించి, రూ.8,84,990 రికవరీ చేసినట్లు పుత్తూరు అడిషినల్ జూనియర్‌సివిల్ జడ్జి వి.గోపాలకృష్ణ, తిరుపతి రెడ్ శాండల్ స్పెషల్ జడ్జి ఎస్.శ్రీకాంత్ తెలిపారు. వీటిలో సివిల్ కేసులు 2, బ్యాంకు కేసులు 8, ఎక్సైజ్ కేసులు 15, క్రిమినల్ కేసులు 46, పెట్టీ కేసులు 185 పరిష్కరించారు.

రాజీయే రాజమార్గం

రేణిగుంట: రాజీయే రాజమార్గమని శ్రీకాళహస్తి సీనియర్ సివిల్ జడ్జి బేబిరాణి అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం శ్రీకాళహస్తి కోర్టు ఆవరణలో నిర్వహించారు. తొలుత కోర్టు ఆవరణలో వైద్య శిబిరాన్ని సీనియర్ సివిల్‌జడ్జి ప్రారంభించారు. అనంతరం దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించారు. రాజీ కుదిర్చిన కేసుల్లో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలో 4, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలో 23 పెండింగ్ కేసులు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలో 12 కేసులు, మండల లీగల్ సర్వీస్ కమిటీ ద్వారా 3 కేసులను పరిష్కరించినట్లు బేబిరాణి తెలిపారు.

వసంతోత్సవం.. నేత్రపర్వం



తిరుచ్చి వాహనంపై విహరిస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేదనారాయణ స్వామి

పిచ్చాటూరు: నాగలాపురం శ్రీవేదనారాయణ స్వామి వసంతోత్సవాన్ని శనివారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగియడంతో సిబ్బంది, మోతగాళ్లు పసుపు, చందనం, పచ్చకర్పూరం, కుంకుమలో సుగంధ ద్రవ్యాలను కలిపిన మిశ్రమంతో వసంతాలు చల్లుకున్నారు. ఈ సందర్భంగా సాయంత్రం 7 గంటలకు ఆలయంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేదనారాయణ స్వామిని శ్వేత వస్త్రాలతో అలంకరించి తిరుచ్చి వాహనంపై ఆశీనులు చేసి తిరువీధుల్లో ఊరేగించారు. ఉత్సవమూర్తుల ఎదుట వసంతాలను అర్చకులు అందిస్తూ ఊరేగింపు నిర్వహించారు. రాత్రి నిజాలయంలో స్వామికి ఏకాంత సేవ నిర్వహించారు.

బీసీ-సి కాదని నిరూపించుకోండి చూద్దాం



మాట్లాడుతున్న వైఎస్ఆర్‌సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు చిన్నదొరై

- మాజీ ఎమ్మెల్యే హేమలతకు పిచ్చాటూరు, నాగలాపురం దళిత నాయకుల సవాల్
- డీకేటీ, ఫారెస్టు భూములు ఆక్రమణ నిజం కాదా?
- మా ఎమ్మెల్యేపై నిరాధార ఆరోపణలు చేస్తే సహించం

వరదయ్యపాళెం: తాము చూపిన రాజమండ్రి కళాశాల టీసీ నిజం కాదని, తనది బీసీ–సి కాదని మాజీ ఎమ్మెల్యే హేమలత నిరూపించాలని పిచ్చాటూరు, నాగలాపురం నాయకులు సవాల్ విసిరారు. శనివారం సత్యవేడు ఎమ్మెల్యేపై దిశా చట్టం కింద కేసు నమోదు చేయాలని, ఎమ్మెల్యే తాగేసి మాట్లాడారంటూ టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ నాయకునితో కలిసి మాజీ ఎమ్మెల్యే హేమలత, సత్యవేడు ఇన్‌చార్జ్ హెలన్ విలేకరుల సమావేశంలో చెప్పినట్లు సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయి. దీనిపై స్పందించిన దళిత నాయకులు దీనిని ఖండించారు. వైఎస్ఆర్‌సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు చిన్నదొరై మాట్లాడుతూ, నియోజకవర్గంలోని పలు మండలాల్లో మాజీ ఎమ్మెల్యే హేమలత డీకేటీ భూములను ఆక్రమించుకున్నారన్నారు. వీటితో పాటు తమిళనాడు మాజీ మంత్రి విజయ సారథి తన భర్త అని నకిలీ సర్టిఫికెట్ పొంది ఆయన భూములను కూడా కాజేశారని, ఆమె డీకేటీ, ఫారెస్టు భూములు ఆక్రమించుకున్నారని తాము ఆధారాలతో సహా చూపామన్నారు. ఇవన్నీ అవాస్తవమని నిరూపించుకోగలరా? అని ఆయన సవాల్ విసిరారు. తమ ఎమ్మెల్యేపై కువిమర్శలు, అవినీతి ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. హెలెన్ కనీసం తెలుగులో స్పష్టంగా మాట్లాడగలరా? అని ఆయన ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ అపరంజిరాజు, మండల రైతు సలహా కమిటీ చైర్మన్ చిన్నదొరై, వైఎస్ఆర్ టీయూసీ చైర్మన్ ఎస్ఎం సురేష్, నాయకులు డానియేల్, రాజా, మహేష్, పిచ్చాటూరు మండల నాయకులు తొప్పయ్య, మోహన్, అలగేశన్, ఢిల్లీ, రోసు, జేమ్స్, రాజామణి, ఈశ్వర్, ఏలుమలై, శేఖర్, అబ్రహాం, రామరాజ్, అశోక్ పాల్గొన్నారు.

టీచర్ల గ్రామబాట



గ్రామబాటలో ఉపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో కల్లివెట్టు గ్రామ జెడ్పీ హైస్కూలు టీచర్లు బడిఈడు పిల్లలను స్కూళ్లలో చేర్పించాలని శనివారం గ్రామాల బాట నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు రమణయ్య టీచర్లతో కలిసి గాంధీకాలనీ, మొక్కులచేను, గిరిజన గ్రామాలలో పర్యటించారు. బడిఈడు, బడి బయట పిల్లల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లలను స్కూళ్లలో చేర్పించి వారి భవితకు బాటలు వేయాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నట్టు హెచ్ఎం తెలిపారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యతో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. పది పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల మార్కుల కరపత్రాలను పంచారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, నాదెండ్ల మురళి, ఒబ్బుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి వెండి పాత్ర సమర్పణ



జనార్దన్‌రెడ్డికి వెండి పాత్రను ఇస్తున్న త్రినాథ్

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహ స్వామికి శనివారం దేవస్థాన వేద పండితుడు త్రినాథ్ కల్యాణ్ దంపతులు 450 గ్రాముల వెండి పంచామృత పాత్రను సమర్పించినట్లు ఆలయ ఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు. దీని విలువ 40 వేల రూపాయల వరకూ ఉంటుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి, ప్రసాద్ స్వామి, మల్లికార్జునస్వామి, నాగరాజస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆదరించమ్మా.. ఆది పరాశక్తి

- నాలుగో రోజు ప్రత్యేక పూజలు
- ఇంటింటా పూజలందుకున్న దొర వేషధారులు
- ఆకట్టుకున్న జానపద, దేవతామూర్తుల వేషాలు



తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ జాతర సందర్భంగా నాలుగో రోజు శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివరావడంతో ఆలయం కిటకిటలాడింది. భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు గంగబొట్లు పెట్టుకొని, వేపాకు నడుముకు కట్టుకుని ఆలయానికి వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. కొందరు జానపద, దేవతామూర్తుల వేషాలతో అలంకరించారు. కుటుంబ సమేతంగా పొంగళ్లు పెట్టి అమ్మవారికి సమర్పించారు. వేయి కళ్ల దుత్తలతో ప్రదక్షిణ చేశారు. ఆదరించమ్మా! ఆది పరాశక్తి అని వేడుకున్నారు. సంప్రదాయబద్ధంగా ఆలయం తరఫున కైకాల కులస్తులు దొరవేషం, చాకలి కులస్తులు మంత్రి వేషం ధరించి నగరంలో తిరుగుతూ ప్రతి ఇంటా పూజలు అందుకున్నారు.

నేడు మాతంగి వేషం

తాతయ్యగుంట గంగమ్మ జాతరలో ఐదవ రోజు ఆదివారం మాతంగి వేషాన్ని ధరిస్తారు. ఈ వేషాన్ని గుడి తరఫున మీరాశిదార్లు, మొక్కుబడి ఉన్న స్థానికులు వేయడం ఆనవాయితీ. మిరాశీదార్లు వేసే మాతంగి వేషంలో కైకాల కులస్తుడొక్కరే పాల్గొంటారు. మాతంగి వేషాన్ని గంగమ్మ విశ్వరూపంగా భావిస్తారు. మాతంగి వేషధారి తన ఒడిబాలులో ఉండే అక్షింతలు, వేపాకును అందరికీ పంచిపెడుతూ తిరుపతిలో ఇంటింటా పూజలు అందుకుంటారు. మొక్కుబడి ఉన్న భక్తులు మాతంగి వేషం ధరించి డప్పుల దరువుల నడుమ చిందులు వేస్తూ వేషాలమ్మను, వివిధ గ్రామదేవతలను దర్శించుకుంటారు. అనంతరం గంగమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ.

271 మద్యం బాటిళ్లు ధ్వంసం



గూడూరు: గూడూరు ఎస్ఈబీ పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 271 మద్యం బాటిళ్లను శనివారం స్థానిక ఎస్ఈబీ కార్యాలయ ఆవరణలో ధ్వంసం చేసినట్లు ఎస్ఈబీ ఇన్‌చార్జ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ పీ. విజయ్‌కుమార్ తెలిపారు. వీటి విలువ రూ 35,230 ఉంటుందని ఆయన తెలిపారు. బాటిళ్లలోని మద్యాన్నిపారబోసి, ఖాళీ మద్యం బాటిళ్లు, సంచులను కూడా తగులబెట్టినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఈబీ ఎస్ఐ శేషమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కంటి ప్రసాదం పోటు తనిఖీ



ప్రసాదాల తయారీ పోటును పరిశీలిస్తున్న ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

రేణిగుంట: శ్రీకాళహస్తి దేవస్థానంలో ప్రసాదాల తయారీ పోటును శనివారం ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. లడ్డూ పరిమాణాన్ని పరిశీలించి రుచి చూశారు. ప్రసాదాల ఇండెంట్ బుక్‌ను తనిఖీ చేశారు. ప్రసాదాలు బాగున్నాయని సిబ్బందికి కితాబిచ్చారు. దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులకు అందించే ప్రసాదాన్ని నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలతో అందివ్వాల్సిన బాధ్యత పోటు కార్మికులపై ఉందన్నారు. రోజు రోజుకు భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో భక్తులకు సరిపడా ప్రసాదాలను తయారు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. తమకు వేతనాలను పెంచాలని ఆయనకు అక్కడ పనిచేసే సిబ్బంది విజ్ఞప్తి చేశారు. రానున్న పాలకమండలి సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అంజూరు వారికి హామీ ఇచ్చారు. పోటు సిబ్బంది విశ్వనాథం, చైర్మన్ పీఏ పసుపులేటి కామేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీవారి తిరునామాలకు ప్రత్యేక పూజలు



పూల అలంకరణలో తిరునామాలు



పోలేరమ్మ విగ్రహం వద్ద పూజలు చేస్తున్న గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ:మండలంలో నీర్పాకోటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలోని తిరునామాలకు శనివారం భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పూలతో అలంకరించి ఉత్సవమూర్తులను గ్రామవీధుల్లో ఊరేగించారు. తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. గ్రామస్తులు, భక్తులు టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించారు.

పోలేరమ్మకు..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో కాంపాళెంలోని పోలేరమ్మకు శనివారం ఘనంగా పూజలు నిర్వహించారు. గ్రామస్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. పోలేరమ్మ దయతో పంటలు బాగా పండాయని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

యంత్రంతో శ్రీవరి నాట్లు



పల్లమాలలో యంత్రంతో వేస్తున్న శ్రీవరి నాట్లు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాంపాళెం, పల్లమాల, కాటూరు, కనమనంబేడు గ్రామాల రైతులు యంత్రంతో శ్రీవరి సాగు చేస్తున్నారు. కాంపాళెం రైతులు 20 ఎకరాల్లో ఈ పంట సాగు చేస్తున్నారు. యంత్రంతో వరినాట్లు వేయడం వలన కూలీల ఖర్చు ఆదా అవడమే కాకుండా తక్కువ సమయంలోనే నాట్లు వేయవచ్చని రైతులు చెప్పారు. మరోవైపు పంట సాగుకు నీటి వినియోగం కూడా తక్కువ అని, కూలీలు నాటిన వరిపంట కంటే ఎకరాకు ఐదు బస్తాల ధాన్యం దిగుబడి పెరుగుతుందని రైతులు పేర్కొన్నారు. ఇప్పటికే పల్లమాల, కారణి గ్రామాల్లో శ్రీవరిని రైతులు సాగుచేస్తున్నారు. శ్రీవరిలో కలుపు ఉండదని, తెగుళ్లు ఎక్కువగా ఆశించకపోవడం, ధాన్యం నాణ్యత బాగా ఉంటుందని రైతు చెప్పారు.

అద్భుత గ్రంథం 'దివ్య వేదవాణి'



దివ్య వేదవాణి గ్రంథాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

తొట్టంబేడు (రేణిగుంట): ప్రముఖ ఆధ్యాత్మిక రచయిత డాక్టర్ ఎం. కృష్ణారెడ్డి ఆర్య ఆధ్వర్యంలో ముద్రించిన దివ్య వేదవాణి అద్భుత గ్రంథమని డీఎస్పీ భీమారావు అన్నారు. శనివారం దేవస్థానం ప్రాంగణంలో ఉన్న శుక బ్రహ్మాశ్రమ బుక్‌స్టాల్‌ను ఆయన సందర్శించారు. దివ్య వేదవాణి గ్రంథాన్ని ఆసక్తిగా తిలకించారు. మన హిందూ సంప్రదాయాలకు అద్దం పట్టేలా ఈ గ్రంథం ఉందన్నారు. ఇలాంటి గ్రంథాలను చదివి మన హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలన్నారు. బుక్‌స్టాల్ యజమాని ఐతా మురళీకృష్ణను అభినందించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ విజయ్‌కుమార్, ట్రాఫిక్ ఏఎస్ఐ రియాజ్ పాల్గొన్నారు.

దారికి అడ్డుగా ఎడ్లబండి, ఎడ్లు



మరదవాడ పాత ఊరిలో రోడ్డుకు అడ్డంగా ఉన్న ఎడ్ల బండి, ఎద్దులు

- సామరస్యంగా చెప్పినా పెడచెవిన పెట్టిన రైతు
- సమస్య పరిష్కరించాలని గ్రామస్తుల వినతి

వరదయ్యపాళెం: మండలంలోని మరదవాడ పాత ఊరిలో దారి సమస్య తీర్చాలని స్థానికులు కోరుతున్నారు. ఓ వీధిలో దారికి అడ్డంగా ఎడ్ల బండ్లు, ఎద్దులను ఆ ప్రాంతంలో ఉంచడం వల్ల అటువైపు వెళ్లలేక అవస్థలు పడుతున్నట్లు గ్రామస్తులు చెప్పారు. ఇటీవల అనారోగ్యానికి గురైన వ్యక్తిని తరలించేందుకు అటువైపు వాహనం వెళ్లలేకపోవడంతో వ్యక్తిని మంచంపై మోసుకెళ్లి వాహనం వద్దకు చేర్చినట్లు చెప్పారు. దీనిపైఅడ్డంగా ఉన్న ఎడ్ల బండ్లను పక్కకు తీయాలని సంబంధిత రైతుకు విన్నవించినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే దీనిపై స్పందించి అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వేడుకగా కల్యాణోత్సవం



నాయుడుపేటటౌన్: మండలంలోని తిమ్మాజికండ్రిగ గ్రామ సమీపంలో స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న దుర్గామల్లేశ్వర దేవి ఆలయంలో ధ్వజస్తంభ, దక్షణామూర్తి నవగ్రహ విగ్రహల ప్రతిష్ట కార్యక్రమాలను మూడు రోజులు పాటు వైభవంగా నిర్వహించారు. చివరి రోజు శుక్రవారం రాత్రి స్వామి, అమ్మవారి శాంతి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా చేశారు. వేద పండితులు మహా మంగళ హారతి, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

క్రీడలను మరింత ప్రోత్సహించండి



క్రీడాకారులతో రాష్ట్ర మాజీ కోచ్ రాజు, నిర్వాహకులు, సీనియర్ క్రీడాకారులు

నాయుడుపేటటౌన్: క్రీడాకారులకు తరచూ క్రీడాపోటీలను నిర్వహించి ప్రోత్సహించాలని ఉమ్మడి ఏపీ పోలీస్ ఫుట్‌బాల్ రాష్ట్ర మాజీ కోచ్ ఎస్ఐ కే.రాజు అన్నారు. నాయుడుపేటలో జరుగుతున్న సౌత్ ఇండియా స్థాయి ఫుట్‌బాల్ పోటీలను శనివారం సాయంత్రం ఆయన తిలకించారు. కార్యక్రమంలో గుమ్మిడిపూండి రైల్వే ఎస్ఐ, సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారులు మైనుద్దీన్, సీనియర్ క్రీడాకారులు రాజన్‌బాబు, కోచ్ గౌస్, భవాన్ అనుదీప్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పోటీల ఫలితాలు

తిరుపతిపై చెన్నై సిటీ పోలీస్, నెల్లూరు జట్టుపై చెన్నై మీంజూర్ క్లబ్, హుబ్లీ జట్టుపై ఫలక్‌నామా హైదరాబాద్, సికింద్రాబాద్ జట్టుపై విశాఖపట్నం గెలిచాయి. ఆదివారం ఉదయం సెమీఫైనల్స్, సాయంత్రం ఫైనల్స్ జరుగుతాయని నాయుడుపేట ఫుట్‌బాల్ క్లబ్ నిర్వాహకులు చెప్పారు.